# డబ్బుపోయి డోలు వచ్చె ధాం ధాం ధాం...

"హల్లో, హల్లో... నమస్కారం. కనపట్టమే లేదీ మధ్య."

"ఏదండీ తీరిక దొరకటం లేదు"

"మీరలా అంటే ఎలా? రండలా వెళ్ళి కాఫీ తాగుదాం"

"అర్జంటు పని మీద వెళ్తున్నానండీ, మళ్ళీ కలుద్దాం."

"అమ్మమ్మ... ఎంత మాట? పనుల్లేని వాళ్ళెవరు. మీరు కనపడ్డారు సంతోషం. మీతో రెండు మాటలు మాట్లాడకపోతే నాకు మనశ్శాంతి వుండదు. మీరేం చెప్పకండిహ"

నాకు భయమేసింది. ఎదురుకుండా "ననరా.. ననరా" అని సంగీతం పాడుకుంటూ, భుజాన బాగు, ధోతీ, లాల్చీతో కన్పించిన సుధాకరరావును చూడగానే, పక్క సందుల్లోకి దూర్దామని ప్రయత్నం చేశాను కానీ, ఆ పాడు వీధిలో సందులేమీ లేకపోవడం వల్ల, అతనికి బలి అవక తప్పలేదు, సుధాకరరావు ఒక కవి. -'సుకవి' అని కలం పేరు. 'సుత్తికవి' అని లోకులనుకుంటారనుకోండి. 'లోకులుపలుకాకుల'ని వాళ్ళమాటలు పట్టించుకోవలసిన అవసరంలేదు. 'హీరమ్యుంజెడుగాగ, శుచిందంభిగా...' వగైరా భర్తృహరి చెప్పనే చెప్పాడు గదా!

సరిహద్దులో సైన్యం ఎంత అప్రమత్తంగా వుంటుందో సు(త్తి)కవి అంత అప్రమత్తంగా వుంటాడు. ఎటొచ్చీ తేడా అల్లా సైన్యం ఎదిరించేది శత్రువైతే సు(త్తి)కవి చీల్చి చెండాడేది మిత్రబృందాన్ని. కాని సు(త్తి)కవి భుజాన తగిలించుకున్న బాగులోని శస్త్రంతో సైన్యం ఉపయోగించే స్టెన్‌గన్స్ ఏమాత్రం సరిపోవు. ఆ సంచీలో అతను కవితలు రాసుకునే పుస్తకముంది. కవితల్ని, తుపాకుల్లా, ఫిరంగుల్లా వాడతాడు. అతని పాలబడ్డవాడు క్షతగాత్రుడవటం తథ్యం. తప్పంతా కవితల తుపాకి గుండ్లను ఓర్చుకోలేని చచ్చుసన్నాసులదిగాని, తనది కాదని అతని భావన.

అలాంటి ఎందరో చచ్చు సన్నాసుల్లో నేనొకడిని. అతనితో నాకెంతకాలం నుండో పనివున్నా, వాలిలా ఎదుటివాడి శక్తిని గుంజుకొని నిర్వీర్యుణ్ణి చేయగల అతని సత్తా తెల్సుకుని తప్పించుకు తిరుగుతున్నాను. ఇహ తప్పదు. బలి పశువులా అతని వెంట హోటలువైపు నడక సాగించాను.

హోటల్లో కూర్చున్న తరువాత ఇడ్లీ, దోసె, కాఫీ వరుసగా తీసుకురమ్మని ఆర్డరు వేసి కాలయాపన సహించలేక, తన కవితా ఉద్గ్రంథాన్ని తెరిచాడు సు(త్తి)కవి.

''ఈమధ్య కొన్ని కొత్త కవితలు రాశాను. మీరు కన్పించకపోవటం వల్ల వినిపించటం పడలేదు. అబ్బ! ఏం చక్కగా వచ్చాయండీ! అలా మూడ్‌లోకి పోతే అలా అలా దర్శనమిస్తాయి. మనముందు నృత్యం చేస్తాయి కవితా కన్యకలు. అందుకనేకదండీ 'కవిబ్రహ్మ' అన్నారు. మచ్చుకొకటి వినిపిస్తాను. కవిత పేరు ' ఉష్ట్రపక్షి' అంటూ తన ఉద్గ్రంథాన్ని తెరిచాడు సు(త్తి)కవి. ఆ పైన కవితా గానం చెయ్యసాగాడు.

''ఉష్ట్రపక్షీ! ఉష్ట్రపక్షీ!
పారకోష్ట్రపక్షీ!
కష్టాల అగ్నికణాలు కుడిచే అక్కుపక్షీ!
కవితా క్షిపణుల విస్ఫోటనలకే
అదిరిపోయిన దిక్కుమాలిన పక్షీ!
ఏం సాధిస్తావోయ్ ఇహంలో
ఏం పొందగలవోయ్ జీవితంలో
ప్రభుత్వాలయాల్లో ఉష్ట్రపక్షులు
కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఉష్ట్రపక్షులు
పొలాల్లో. ఫ్యాక్టరీల్లో
అన్నింట్లో ఉష్ట్రపక్షులు
దేనిమీదా ఆసక్తిలేదు
పోయే జీవితాన్ని పట్టుకోవాలన్న కోరికాలేదు
బతకాలన్న ఇచ్ఛాలేదు.
చావాలన్న తెగింపూలేదు.
ఎందుకీ జీవచ్ఛవపు బ్రతుకు?
లే
బతుకు, వియత్తలంలో విరిసే ఇంద్రధనుస్సులా
బతుకు, నర్తించే నిటలాక్షుని ఢమరుకంలా''

''మనకు ఎక్కడ పట్టినా కన్పిస్తుంది ఈ ఇండిఫరెన్స్- దేనిమీదా అసక్తిలేని తనం, ఏదీ కావాలనుకోకపోవటం, కమిట్‌మెంటో ధ్యేయమో లేకపోవటం దాన్నే ఈ కవితలో ప్రెజెంట్ చేశాను. ఎలా వుందంటారు?'' అడిగాడు సు(త్తి)కవి.

'నీ మొహంలా వుంది' అనుకున్నాను మనసులో. పైకి, ''అద్భుతం. చాల చక్కగా వుంది. ఎంత చక్కగా చెప్పారు. బతకాలన్న ఇచ్చాలేదు, చావాలంటే తెగింపూ లేదనీ, జీవచ్ఛవపు బతుకు బతుకుబతున్నారనీ ఎంత చక్కగా విమర్శించారు!'' అన్నాను.

''అసలు విషయం మీరు గమనించనే లేదు ఉష్ట్రపక్షిని అలా నిరాసక్తంగా బతుకుతున్న వాళ్ళకు ప్రతీకగా వాడాను. ఆప్ట్‌గావుందా'' అడిగాడు సు(త్తి)కవి.

''బ్రహ్మాండం. అసలక్కడే మీలో కవి బయటపడ్డది... పాపం ఎంత యమయాతన పడ్డారో ఆ భావానికి రూపకల్పన చేయటానికి''

''కాదుటండీ మరీ! మథిస్తేగాని అమృతం వెలువడదు.''

''నాకు తెలీదా ప్రతి కవీ ఎంతగా లేబర్ పెయిన్స్‌కి లోనయి కవితా కన్యకు జన్మనిస్తాడో...'' అన్నాను.

ఇలా కవుల్ని ఉబ్బేయటం మన గొయ్యి మనం తవ్వుకున్నట్టేనని నాకు తెలీకపోలేదు. కాని అవసరం నాది. ఆర్నెల్ల క్రితం సు(త్తి)కవి నా దగ్గరకొచ్చి సీరియస్‌గా, ''గురూగారూ! నాకర్జంటుగా ఐదువేలు కావాలి. ఇరవై నాలుగ్గంటల్లో తిరిగిస్తాను'' అన్నాడు. అన్ని తక్కువ మాటలు అతను వాడింది జీవితంలో మొదటిసారేమో. నాకు ముచ్చటేసింది. సరేనని, అతనికి డబ్బిచ్చి పంపేశాను. నా దగ్గరవుండి ఇచ్చానా, ఓ మిత్రుడి దగ్గర అప్పుతెచ్చి మరీ ఇచ్చాను. అంతే, డబ్బు తీసుకున్నవాడు మళ్ళా కనపడలేదు. నిజానికి తప్పు ఆయన్దికాదు. నేను అతని ఇంటికి వెళ్తేకనపడేవాడే. ఇంట్లో కాపలాపెట్టుకున్న కవితా క్షిపణుల భయానికి నేనే అతని ఇంటికి వెళ్ళలేదు. ఎప్పుడైనా ఇలాగే బజార్లో కనపడ్డా తీసుకున్న అప్పు సంగతి మాట్లాడేవాడు కాదు. నేనే పొరపాటున అడిగితే, నన్నో పురుగులా చూసేవాడు- 'నిషాదుడా! ఊహల లోకంలో విహరించే విహంగాన్ని నన్నిలా అప్పుల బాణాలతో బాధించటం నీకు తగునా?' అన్నట్టు చూసేవాడు. దానితో ''పోన్లెండి, వీలయినంత త్వరగా సర్దుబాటు చెయ్యండి'' అనేవాడిని నేను. '' ఇవాళ ఎలాగయినా ఈయన బారిపడ్డాను, అప్పుసంగతి తేల్చుకోవాల్సిందే'' అని నిశ్చయం చేసుకున్నాను.

సు(త్తి)కవి ఇంకా ఏం చెప్పేవాడో ఏమోకానీ, సర్వేశ్వరుడు ప్రత్యక్షమై ఇడ్లీప్లేటు ప్రసాదించటంతో ఇహంలోపడి, కవితా పరాన్ని మర్చిపోయి, అదే జీవిత సత్యమైనట్లు ఈగలా ఇడ్లీలమీద వాలి, వాటిని వధించసాగాడు చెంచాలతో, నాకు కొంత తెరపి దొరికినట్లయింది. ఇడ్లీ

అవగానే దోసె పట్టుకొచ్చాడు సర్వేశ్వరుడు. సాంబారు గిన్నె పెట్టబోతుంటే సు(త్తి)కవి చెయ్యి తగిలి గిన్నెలోనుండి వలికిన సాంబారు అతని లాల్చీని పావనం చేసింది. దాంతో నిటలాక్షుడిలా లేచాడు సు(త్తి)కవి, ''యు బ్లడీ రాస్కెల్! వళ్ళు తెలియటం లేదురా'' అని.

''నే పెట్టబోతుంటే మీ చెయ్యే తగిలింది సార్. గుడ్డతో తుడిచేస్తా సార్!'' అన్నాడు సర్వర్ క్షమాపణలతో.

''షటప్ యూజ్‌లెస్ ఫెలో: చెయ్యాల్సిందంతా చేసి, పైగా నేను చేత్తో తోశానంటావా? స్కౌండ్రల్, రోగ్...'' అని తిట్లకులంకించుకున్నాడు. సు(త్తి)కవి.

హోటల్ మేనేజర్ వచ్చి, నానా అవస్థపడి, చివరకు కవిని శాంతింపచేశాడు. నాకు సాంబారు పడటంలో అభ్యంతరమేమీలేదు గానీ, అది అతని లాల్చీమీద కాకుండా, ఆ కవితా ఉద్గ్రంథం మీద పడి పూర్తిగా తడిపేసినట్టయితే బాగుండేదనుకున్నాను. అయితే, మనమనుకున్నవి అనుకున్నట్లుగా జరగవు గదా ఈ పాడు ప్రపంచంలో.

సు(త్తి)కవి మళ్ళీ తన పుస్తకాన్ని తెరవబోయాడు.

''ముందు ఆ దోసె కానివ్వండి. తరువాత తీరిగ్గా కవితా గానం చేద్దురు'' అన్నాను.

''మీరన్నది నిజమే. కవితాగానానికి ఎన్ని కాలరీల శక్తి కావాలంటారు? నాకు ఓ కవిత చదివిం తర్వాత ఏమయినా తింటే బాగుండుననిపిస్తుంది. రసాస్వాదనం చేస్తూ కవితా గానం చెయ్యటానికి నిజంగా చాలాశక్తి కావాలి సుమండీ'' అన్నాడు అతను.

''నిజం చెప్పారు. ఆ మాటకొస్తే కవిత విన్న తరువాత శ్రోతలకేమయినా తినకపోతే కడుపులో ఏదో దేవినట్టుగాను, తిప్పినట్టుగాను యమ బాధగా వుంటుంది. శరీరంలో వున్న శక్తి అంతా కవిత్వరసాస్వాదనకే పోతుంది కదండీ. ఒక్కోసారి నాలుక పిడచకట్టుకున్నట్టయిపోతుంది. అందుకనే కవులు కొందరు సభ అయింతరువాత మిత్ర బృందంతో 'వెట్' పార్టీలు చేసుకుంటారు'' అన్నాను.

కాఫీ తాగింతర్వాత మళ్లీ ఉద్గ్రంథం తెర్చి ఓ రెండు కవితలు చదివాడు సు(త్తి)కవి. గాడిద కాళ్ళు పట్టుకున్న వసుదేవుడి ముందు మనమెంత? అవసరం నాది కనుక చదవబోతుంటే, ''గురువుగారూ, మీరు ఆర్నెల్లక్రితం తీసుకున్న డబ్బు-'' అని నసిగాను.

'' ఆఁ అదే డబ్బు. మీతో చెబ్దామనుకుంటున్నాను. కవిత్వంలో డబ్బు లేదండీ! ఎంతో శ్రమించి రాసి పుస్తకం అచ్చువేస్తే కొనే నాధుడే లేడు. నవలల్లో డబ్బుందండీ! ఓ నవల అలా రాసిపారేస్తే, పత్రికలు సీరియల్‌గా అచ్చేస్తాయి. ఇక మనకు ధనవర్షమే. నిజానికా చచ్చు ప్రక్రియ చేపట్టటం కాకిష్టం లేదు. కాని ఈ ఋణదాత మత్కుటాల బాధ భరించటం కష్టంగా

వుండటంతో నవలా రచనా సాగిస్తున్నాను. ఎందుకూ ఇంకో వారంలో నవల అయిపోతుంది. మరో నెల్లో అది సీరియల్‌గా వస్తుంది. అలా పారితోషికం అందుకోవటం, ఇలా మీకిచ్చేయటమే తరువాయి. చూడండి. ఓ చిన్న సీను ఎలా రాశానో. నిజానికి నవలంతా సస్పెన్స్. మొదలెట్టటమే సస్పెన్సుతో మొదలెట్టాను. ఊపిరి ఆడదనుకోండి'' అంటూ సంచీలోంచి ఇంకో ఉద్గ్రంధాన్ని తీశాడు అతను.

నాకు బిక్కచచ్చిపోయినట్లయింది. ఇది కొత్తవిషయం. ఈ రెండో అస్త్రంతో నా వళ్ళు చీరుకుపోవటం ఖాయం. బాకీ సంగతెలా ఉన్నా, దీని బాధ భరించటం కష్టం అని తీర్మానించుకుని లేవబోతుంటే చేయిపట్టుకు కూర్చోపెట్టాడు సు(త్రి)కవి.

'ఏమిటలా ఉన్నారు. మరో కాఫీ తాగండి'' అని ''బేరర్! ఓ రెండు కాఫీ పట్రావోయ్...'' అంటూ రెండో గ్రంధం తెరిచాడు అతను.

''వినండి వింటే వళ్ళు గగుర్పాటు కల్గుతుంది'' అని చదవసాగాడు.

''అర్ధరాత్రి గాఢాంధకారం 'కెవ్వు' మన్న అరుపు - ఒళ్ళు జలదరింపు చేసే అరుపు. ఆ నీరవ నిశ్శబ్ద నిశీధిలో పక్కింట్లో లైటు వెలిగింది. చుట్టు పక్కల ఇళ్ళల్లో లైట్లు వెలిగాయి. జనం బయటకొచ్చారు. ఆ అరుపు వినిపించిన ఇంటి తలుపు దబదబా బాదారు. ఇంటాయన వచ్చి తలుపు తీశాడు. 'ఏమయింది మీ ఇంట్లో? ఆ అరుపు మృత్యుఘోషలా వుంది.' అని అడిగాడో వ్యక్తి. మా 'ఆవిడ ఏదో చూసి భయపడింది' అంటూ లోపలకు దారితీశాడాయన. జనం ఆయన్ను అనుసరించారు. ఆమె పక్కమీద పడుకుని వుంది. చేతులూ, కాళ్ళూ విపరీతంగా ఆడిస్తూ వుంది. కొంగర్లు పోతున్నట్టుంది- 'బాణామతి' అన్నారెవరో. 'ఏదో చూసి భయపడింది' అన్నాడొకతను. 'బాణామతా, గాడిద గుడ్డా! దయ్యాల్లేవు, భూతాల్లేవు' అన్నాడో హేతువాది. పక్కనున్న చెంబుతో నీళ్ళు తీసుకుని ఆమె ముఖాన చల్లాడొకాయన. 'పిలవండి మీ భార్యని' అన్నాడాయన. 'నిర్మలా!' అని పిల్చాడాయన. కొంతసేపటికామె కళ్ళు తెరిచింది. 'ఏమయింది?'. అడిగాడు ఆమె భర్త ఆత్రుతగా. 'ఏదో మీద పడినట్లయింది' అంది నిర్మల భర్తతో తేరుకున్న తరువాత. 'అది తప్పక దయ్యమే. మాంత్రికుణ్ణిపిలిపించి విభూతి పెట్టిస్తే మంచిది' అని సలహా ఇచ్చాడు భూతప్రేత పిశాచాల మీద నమ్మకమున్న పెద్దమనిషి. 'ఏదో పీడకల వచ్చినట్టుంది' అన్నాడు మరొకాయన. ఇలా తర్జన భర్జనలు జరుగుతుండగా బీరువా మీద నుండి కిటికీలోకి దూకి చువ్వలగుండా దూరి బయటకు పారిపోయింది ఓ పిల్లి!' అలా మొదలవుతుంది నవల. పాఠకులు ఉత్కంఠతో బిక్కచచ్చిపోవాల్సిందే'' అన్నాడు సు(త్రి)కవి.

బేరర్ కాఫీ తెస్తే తాగాను. నా ప్రాణాలు కడబట్టిపోయాయి. మాట్లాడే ఓపిక లేదు.

''పేరేం పెట్టానో తెల్సా? 'రక్తచందనం'. మొన్నో గాడిదకు అక్కడక్కడ నవల్లో కొన్ని

సంఘటనలు వినిపించాను. వాడన్నాడు. అదేం పేరండీ 'రక్తచందనం'. - 'రక్తం' విప్లవానికి హింసకూ ప్రతీకైతే, 'చందనం' పైపూత చల్లదనానికీ, హాయికీ ప్రతీక కదా, అలా రెండింటినీ దగ్గరకు చేర్చి హింసాత్మక సమాసం చేయటానికి మీకు మనసెలా పుట్టింది. పైగా మీ నవల మొదలెట్టిన తీరు ఎక్కడో చదివినట్లుంది' అన్నాడు. నేను మొహం వాచేటట్లు చీవాట్లు పెట్టా. గాడిదలు అంతా విమర్శించేవాళ్ళే. సృజన మాత్రం చేయగలిగేవాడు లేడు. 'రక్తచందనం' ఎంత చక్కటి పేరు. పేరులో వున్న అందాన్ని విస్మరించి మాటల రెక్కలు విరిచి మొండి శరీరాన్ని గ్రహించాలని ప్రయత్నిస్తారు జనం. అసలు కవిత్వంలో అర్థం చూడటానికి ప్రయత్నించేవాడు మూఢుడు. కవిత కర్థమేమిటండీ? ఆనందించాలి. రసాస్వాదనచేయాలి. అంతే. ఎక్కడో ఏ నవల్లోనో ఏదో సంఘటన వుండి చస్తుంది. ఇహ మనం అది కాపీ కొట్టినట్టేనా? అయినా కాపీ కొడ్తేమాత్రం తప్పేం. ఎంత కాపీ కొడ్తే మాత్రం, రచయిత ఒరిజినాలిటీ ఎక్కడకు పోతుంది? అసలు విమర్శకులు తీవ్రవాదులు. హింసించటమే వాళ్ళ లక్ష్యం....'' ఇంకా ఏం చెప్పేవాడో కాని అతని దృష్టి రోడ్డుమీద పోతున్న ఓ వ్యక్తి మీద పడింది. '' ఇదిగో చంద్రశేఖర్ రెడ్డిగారూ! ఆగండి - ఆగండి మీతో మాట్లాడాలి'' అని- పెద్దగా అరిచి, నా వంక తిరిగి ''మీ బాకీకోసం దిగులు పడకండి. నవల పారితోషికం రాగానే మీకిచ్చేస్తే సరికదా'' అని నా సమాధానానికి కూడా చూడకుండా దూసుకుని వెళ్ళిపోయాడు సు(త్తి)కవి, పాపం, అతను పడబోయే బాధ తలపుకొచ్చి నాకు ప్రాణం కడబట్టినట్లయింది.

బేరర్ పాతిక రూపాయలకు బిల్లు తెచ్చాడు. అది చెల్లించి బయటపడ్డాను. ఇంక నా డబ్బుకు తిలోదకాలు వదులుకోవల్సిందేనన్న జ్ఞానం కలిగింది నాకు.

'' ఇక ఛస్తే కవులు, రచయితల జోలికి పోకూడదు'' అని నిర్ణయం తీసుకుని ఇంటి ముఖం పట్టాను.

'డబ్బుపోయి డోలు వచ్చె ఢాం ఢాం ఢాం' అన్నట్టయింది నా పని.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక

1991-92